


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| మంగళవారం 28 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 330 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## బాలల రక్షణ, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాల ప్రారంభం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల సంక్షేమం, యువత అభివృద్ధి లక్ష్యంగా భరోసా, ఎ.హెచ్.టి.యు, షీ-టీమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 6 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ బాలల రక్షణతో పాటు మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్-న్యాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావు, ఎ.హెచ్.టి.యు ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావు, షీ-టీమ్ ఎస్ఐ పూలభాయ్, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణిలో ప్రజల సమస్యలపై స్పందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: జిల్లాలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఓపికగా విని సంబంధిత అంశాలపై ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ సూచిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాందోళనలకు లోను కాకుండా, మధ్యవర్తుల అవసరం లేకుండా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## భారత్ ఫ్యూచర్ సిటీ కేంద్రంగా హైస్పీడ్ రైల్ కారిడార్ హబ్



సందేశం టైమ్స్, హైదరాబాద్ (సచివాలయం), ఏప్రిల్ 28, ప్రతినిధి: భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ కేంద్రంగా హైస్పీడ్ రైల్ కారిడార్ హబ్ అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. డా.బి.ఆర్ అంబేడ్కర్ సచివాలయంలో నిర్వహించిన హైస్పీడ్ రైల్వే కారిడార్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర రవాణా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా మారబోతోందని, పెట్టుబడులకు అత్యంత అనుకూల నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్–పూణే–ముంబై కారిడార్ డీపీఆర్ ఇప్పటికే పూర్తయిందని, చెన్నై వయా అమరావతి, బెంగళూరు కారిడార్ల సర్వేలు కొనసాగుతున్నాయని తెలిపారు. మొత్తం 761 కి.మీ పొడవైన హైదరాబాద్–ముంబై కారిడార్‌లో 12 స్టేషన్లు ఉండగా, 330 కి.మీ వేగంతో 3 గంటల్లో ప్రయాణం సాధ్యమవుతుందని అధికారులు వివరించినట్లు తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ–అమరావతి–చెన్నై, భారత్ ఫ్యూచర్ సిటీ–బెంగళూరు కారిడార్లపై కూడా ప్రత్యేకంగా చర్చించామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వృద్ధి కారిడార్లుగా మారి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యానికి దోహదపడతాయని ఆయన తెలిపారు. కేంద్ర–రాష్ట్ర అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ బృహత్తర ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షలో పలు ఉన్నతాధికారులు, రైల్వే మరియు ఆర్&బీ శాఖ అధికారులు పాల్గొన్నారు.




## ప్రతి కుటుంబం ఖచ్చితంగా వివరాలు నమోదు చేసుకోవాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 28, ప్రతినిధి: జనగణన–2027లో భాగంగా ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని ప్రజాభవన్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమంలో ఆయన స్వయంగా వెబ్‌సైట్ ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ జనగణనలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా సమాచార సేకరణ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. జనగణన ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సరిగ్గా అందేలా అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎంఎల్సీలుగా ప్రమాణ స్వీకారం





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రతినిధి: తెలంగాణ శాసన మండలిలో నూతనంగా ఎన్నికైన మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, కోదండరాం ఎంఎల్సీలుగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అలాగే మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు, ఎంఎల్సీలు, ఎంఎల్ఏలు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మంత్రి సీతక్క పిలుపు – కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత, రక్షణ, మత్తు పదార్థాలకు నో చెప్పండి వారోత్సవాలను ప్రారంభించిన రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) బాల, బాలికలు డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆదర్శంగా నిలవాలని, మంచి లక్ష్యాలతో ఎదిగి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బాలలకు స్పోర్ట్స్ కిట్స్, అవసరమైన ధ్రువపత్రాలు అందజేయగా, ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఒత్తిడి పెంచాలని నిర్ణయించి, వెంటనే విచారణ చేపట్టేలా సీబీఐకి లేఖ రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అవసరమైతే సీబీఐ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలని సూచించారు. న్యాయ నిపుణుల సూచనల మేరకు ఈ కేసులో చట్టపరమైన అడ్డంకులు లేవని, ప్రస్తుతం ఏ కోర్టులోనూ కేసు పెండింగ్‌లో లేదని స్పష్టం కావడంతో ప్రభుత్వం తదుపరి చర్యలకు సిద్ధమైంది. ఈ రెండు అంశాలపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షల్లో పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆటో పల్టీ ఘటనలో ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు



సందేశం టైమ్స్, అనంతగిరి, ఏప్రిల్ 28, ప్రతినిధి: చిలుకూరు మండలం జెర్రిపోతుల గూడెం గ్రామానికి చెందిన పర్వతం సైదులు ఖమ్మం సమీపంలోని పండితాపురం గ్రామంలో జరుగుతున్న ఒక కార్యక్రమానికి మటన్ కొట్టేందుకు గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామానికి చెందిన తెల్లపాటి సైదులు, అదే గ్రామానికి చెందిన అల్వాల శీను, షేక్ మదర్‌లతో కలిసి ఆటో నెంబర్ AP16-TD-6169ను కిరాయికి తీసుకుని బయలుదేరారు. మార్గమధ్యంలో అనంతగిరి మండలం శాంతినగర్ శివారులోని పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే డ్రైవర్ నెమ్మది నాగరాజు (తండ్రి లింగయ్య, గ్రామం బేతవోలు) అతివేగంగా నడుపుతూ ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో ఆటో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో తెల్లపాటి సైదులు తల వెనుక భాగంలో తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందగా, అల్వాల శీనుకు తలపై గాయాలు, షేక్ మదర్‌కు రెండు కాళ్లకు గాయాలు, పర్వతం సైదులకు ఎడమ కాలుకు గాయాలు అయ్యాయి. మృతుడి భార్య తెల్లపాటి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు అనంతగిరి ఏఎస్ఐ సిహెచ్ లింగారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి తారా కళాశాల అధ్యాపకుల ముందడుగు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలలో వేసవి తాపం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఉపశమనం కల్పించేందుకు అధ్యాపకులు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందించి రాగి అంబలి, మజ్జిగ, నిమ్మరసం వంటి శీతల పానీయాల ఏర్పాట్లు చేయడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. కళాశాలలో నాలుగు వేలకుపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, ప్రస్తుతం మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరాల వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే చల్లటి మంచినీటి సదుపాయం కల్పించడంతో పాటు అధ్యాపకులు అందరూ స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేసి పరీక్షల కాలమైన 45 రోజుల పాటు రాగి అంబలి, మజ్జిగ, నిమ్మరసం వంటి పానీయాలను అందించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని స్టూడెంట్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ రత్న ప్రభాకర్ ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రత్న ప్రభాకర్, స్టూడెంట్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## బాలల భద్రత–డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాలు ప్రారంభం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “బాలల భద్రత–డ్రగ్స్ రహిత తెలంగాణ” వారోత్సవాలు నేటి నుంచి మే 2 వరకు కొనసాగనున్నట్లు అదనపు కలెక్టర్ పాండు తెలిపారు. సోమవారం జిల్లాలోని 08 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్‌లలో ఉన్న పిల్లలకు ధృవీకరణ పత్రాల జారీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని ప్రభుత్వ పత్రాలను సమకూర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. 16 నుంచి 23 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలను డీఆర్‌డీఏ ద్వారా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా పిల్లలకు అండగా నిలుస్తుందని, వారి సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని చైల్డ్ కేర్ సంస్థలలో పిల్లలకు అవసరమైన సదుపాయాలు అందిస్తున్నామని, ప్రతి వారం సీసీఐలను తనిఖీ చేస్తూ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాలు దాటిన 10 మంది పిల్లలకు ఆఫ్టర్ కేర్ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు వెంకటేశం, విష్ణుమూర్తి, డిసిపిఓ రత్నం, డిఎల్పిఓ అనిత, డిఎంహెచ్ఓ వసంతరావు, డీఆర్‌డీఏ ఎంపిటి సూర్యారావు, లీడ్ బ్యాంక్ మేనేజర్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్లు యాదగిరి, లింగం, సీసీఐ ప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం అమలుపై అవగాహన కార్యక్రమం



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 28, ప్రతినిధి: సోమవారం సూర్యాపేట జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర చీఫ్ సమాచార కమిషన్ గౌరవ చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పివి శ్రీనివాస రావు, శ్రీమతి మోహ్సినా పర్వీన్, దేశాల భూపాల్‌లు కలెక్టరేట్ ప్రాంగణంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లాలోని పిఐఓలు, ఏపీఐఓలు, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం అమలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ కే. సీతారామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రకటనను జిల్లా పౌర సంబంధాల అధికారి సూర్యాపేట విడుదల చేశారు.

# పెండింగ్ ఆర్టీఐ కేసుల పరిష్కారానికి జిల్లాల పర్యటనలు: ప్రధాన సమాచార కమిషనర్




సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 28, ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల పర్యటనలు చేపడుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)–2005 అవగాహన సదస్సుకు ఆయనతో పాటు సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మోహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్య రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు పారదర్శకంగా, సమయానికి అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. రెండేళ్ల క్రితం వరకు కమిషన్ లేకపోవడంతో దాదాపు 28 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 18 వేల కేసుల విచారణ పూర్తిచేసి 16 వేల కేసుల్లో సమాచారం అందించామని వెల్లడించారు. ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.20 లక్షల మంది ఆర్టీఐ ద్వారా సమాచారం పొందుతున్నారని, అందులో 20 వేల వరకు ఫిర్యాదులు ఫస్ట్ అప్పీల్ అథారిటీ వద్దకు వెళ్తున్నాయని తెలిపారు. వాటిలో సుమారు 10 వేల ఫిర్యాదులు అక్కడే పరిష్కారం పొందుతున్నాయని, మరో 12 వేల ఫిర్యాదులు సెకండ్ అప్పీల్ రూపంలో కమిషన్ వద్దకు వస్తున్నాయని చెప్పారు. గత 10 నెలల్లో సుమారు 15 వేల పెండింగ్ కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రజలకు ఆర్టీఐ చట్టంపై అధిక అవగాహన ఉందని, అందువల్ల ఇక్కడి నుంచి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. పెండింగ్ కేసుల్లో 50 శాతం జిల్లాల పర్యటనలోనే పరిష్కరించి, మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రకటనను జిల్లా పౌర సంబంధాల అధికారి సూర్యాపేట విడుదల చేశారు.



## నూతన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్‌ను సోమవారం జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ పూల మొక్కలు, నోటుబుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

# బాలసదనం పిల్లలకు ధృవీకరణ పత్రాల పంపిణీ



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 28, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలసదనం మరియు అనాధాశ్రమాలు (సీసీఐ)లో నివసిస్తున్న అనాధ మరియు సంరక్షణ అవసరమున్న పిల్లలకు ధృవీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చేతుల మీదుగా పిల్లలందరికీ వారి సంబంధిత ముఖ్య ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను తెలుసుకొని అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పిల్లల భవిష్యత్ విద్య, ఉపాధి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి ఈ ధృవీకరణ పత్రాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అనాధ మరియు సంరక్షణ అవసరమున్న పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది ఒక ముఖ్య అడుగు అని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, డీసీపీఓ రవికుమార్, బాల సంక్షేమ సమితి చైర్మన్ బి. రమణరావు, సభ్యులు పి. బిక్షం, జి. ధనమ్మ, డీసీపీయూ పీఓలు జి. విద్యాసాగర్, మీరా, చిల్డ్రన్ హోమ్స్ సిబ్బంది కవిత, సఫియా, ధనపాల్ తదితరులు పాల్గొన్నారు

# నీట్ (యూజీ)-2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: జిల్లాలో నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 ప్రవేశ పరీక్షను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 3వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 2,772 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ఇందుకోసం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ ప్రక్రియల దృష్ట్యా ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు పైన తప్పనిసరిగా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అతికించుకోవాలని, అదనంగా మరో ఫోటోతో పాటు తాజా ఫోటో ఉన్న ఐడీ ప్రూఫ్‌ను వెంట తెచ్చుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పర్సులు, వాచ్‌లు, బెల్ట్‌లు, చైన్స్, ఇయర్ రింగ్స్, బ్యాంగిల్స్, రింగులు వంటి వస్తువులు అనుమతించబడవని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని, ప్రశ్నాపత్రాల రవాణా మరియు జవాబు పత్రాల భద్రత కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా, త్రాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, సంబంధిత శాఖల అధికారులు, సెంటర్ సూపరింటెండెంట్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, డీఎంహెచ్ఓ, మున్సిపల్ కమిషనర్, ఆర్టీవో, ఆర్టీసీ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి తారా కళాశాల అధ్యాపకుల ముందడుగు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలలో వేసవి తాపం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఉపశమనం కల్పించేందుకు అధ్యాపకులు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందించి రాగి అంబలి, మజ్జిగ, నిమ్మరసం వంటి శీతల పానీయాల ఏర్పాట్లు చేయడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. కళాశాలలో నాలుగు వేలకుపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, ప్రస్తుతం మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరాల వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే చల్లటి మంచినీటి సదుపాయం కల్పించడంతో పాటు అధ్యాపకులు అందరూ స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేసి పరీక్షల కాలమైన 45 రోజుల పాటు రాగి అంబలి, మజ్జిగ, నిమ్మరసం వంటి పానీయాలను అందించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని స్టూడెంట్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ రత్న ప్రభాకర్ ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రత్న ప్రభాకర్, స్టూడెంట్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 28, ప్రతినిధి: సోమవారం హవేలీ ఘనపూర్ మండలం కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు 65 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలలో భాగంగా కళ్యాణ లక్ష్మి పథకం కింద ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అర్హులైన పేద కుటుంబాల యువతులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అమ్మాయిల వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక ఒత్తిడిని తగ్గించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్థిక సహాయంతో వేలాది కుటుంబాలు లాభపడుతున్నాయని, సమాజంలో అమ్మాయిల పట్ల గౌరవం పెరగడమే కాక బాల్య వివాహాలు తగ్గేందుకు కూడా ఈ పథకం దోహదపడుతోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచిస్తూ, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణికి తరలివచ్చిన ప్రజలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: ప్రజల సమస్యల పరిష్కారానికే "ప్రజావాణి" కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి ఒక్కొక్కరి సమస్యను నేరుగా తెలుసుకుని, తక్షణం పరిష్కరించగలిగిన వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. మిగిలిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, బాధ్యతతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొంటూ మండల స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులు పాఠశాలలు ప్రారంభమైన తర్వాత రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలను ప్రతి వారం కనీసం రెండు సార్లు సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్, పంచాయతీరాజ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, డిఆర్డిఏ, ఎక్సైజ్, ఉపాధి, ఇరిగేషన్, విద్య, ఫిషరీస్, విద్యుత్ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అర్జీదారులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు సాధికారత లక్ష్యంగా ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమం




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 28, ప్రతినిధి: నిరుద్యోగ యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణి హాల్‌లో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రకాష్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పథకం పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువతకు క్రమబద్ధమైన వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించే ప్రధాన కార్యక్రమమని వివరించారు. ఈ పథకం కింద ఇంటర్న్‌లకు నెలకు కనీసం రూ.9,000 ఆర్థిక సహాయం, అదనంగా రూ.6,000 పాకెట్ మనీగా అందజేస్తారని తెలిపారు. దేశంలోని అగ్రశ్రేణి కంపెనీలలో వివిధ రంగాల్లో వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పైలట్ దశలో 300కుపైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, ప్రస్తుతం మూడవ దశ కొనసాగుతోందని పేర్కొన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల పదవ తరగతి నుండి పీజీ వరకు చదివిన అర్హులైన యువత అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కెరీర్ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టి.ఎస్.



సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 28, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దివాకర టి.ఎస్. ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బదిలీ కావడంతో సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్‌ను అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ పద్మశ్రీ, ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కారుమంచి శ్రీనివాస్, వివిధ సెక్షన్‌ల పర్యవేక్షకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 28, ప్రతినిధి: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని, వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ రోజు జరిగిన ప్రజావాణిలో మొత్తం 80 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 28, ప్రతినిధి: చింతకాని మండలంలోని చిన్న మండవ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమాన్ని సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మరిదు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# టీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ



సందేశం టైమ్స్, నాగులవంచ, ఏప్రిల్ 28, ప్రతినిధి: టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, వంకాయలపాటి సత్యనారాయణ, అంబటి వెంకటి, అంబటి సత్యం, తాత శ్రీనివాసరావు, సామినేని బాబు, కొల్లి బాబు, కాసాని బుచ్చిబాబు, కొరకొప్పుల వీరబాబు, బూసిపోగు అబ్బురం, పడిశాల తిరపయ్య తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోసానిపేటలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా అందోల్, ఏప్రిల్ 28, ప్రతినిధి: పోసానిపేట గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా దిగుబడులు పెంచుకోవచ్చని తెలిపారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన మోతాదులోనే వినియోగించాలన్నారు. పంట మార్పిడి విధానం పాటిస్తే భూమి సారవంతం మెరుగుపడి దిగుబడి పెరుగుతుందని వివరించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని సూచించారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను ఉపయోగించాలని చెప్పారు. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరిస్తూ రసాయనాల వినియోగం తగ్గిస్తే ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు తమ సమస్యలను అధికారులకు తెలియజేయగా, అధికారులు సమాధానాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జోగిపేట రమాదేవి, ఎంఏఓ శ్రీహరి, ఏఈఓ యశస్విని, పీజేఏటీఎస్ఏయూ అగ్రికల్చర్ కాలేజ్ సెక్రటరీ డా. ఎం.డి. లతీఫ్ పాషా, డా. శ్రీదేవి, విలేజ్ సెక్రటరీ సజ్జు, గ్రామ సర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు, వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్న లీల మధు





సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 28, బి. డేవిడ్: పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గొల్ల వెంకటేష్ మనవడి మొదటి పుట్టినరోజు వేడుకలకు హాజరైన లీల మధు చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం జీటీఎన్ కాలనీ, ఎన్.ఎం.ఆర్ కాలనీకి చెందిన శ్రీకాంత్–స్రవంతి వివాహ విందు కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



# పటాన్చెరువులో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 28, బి. డేవిడ్: పటాన్చెరు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వం, రాష్ట్ర సాధన కోసం ఏర్పాటు చేసిన పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పార్టీ నాయకులు మాదిరి పృథ్వీరాజ్, మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎరుకల సత్యనారాయణ, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయానికి లక్ష రూపాయల విరాళం



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 28, బి. డేవిడ్: పటాన్చెరు పరిధిలోని జేపీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయానికి ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ యువ నాయకుడు పృథ్వీరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు సంతోష్ నాయక్, ఆలయ కమిటీ పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# పుల్కల్‌లో పోచమ్మ తల్లి జాతర ఘన ప్రారంభం – భక్తులతో కిటకిటలాడిన మండల కేంద్రం



సందేశం టైమ్స్, పుల్కల్, ఏప్రిల్ 28, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో పోచమ్మ తల్లి నాలుగవ వార్షికోత్సవ జాతర ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు గణపతి పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించగా భక్తులు భారీగా పాల్గొన్నారు. జాతర సందర్భంగా మండల కేంద్రం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం బోనాల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరినీ జాతరకు ఆహ్వానిస్తూ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జోగిపేట్‌లో గోమాత రక్షణకు వినతి పత్రం సమర్పణ




సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా అందోల్, ఏప్రిల్ 28, ప్రతినిధి: దేశవ్యాప్తంగా 5500 మండలాల్లో కొనసాగుతున్న ఉద్యమానికి మద్దతుగా జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలో గోమాత రక్షణపై హిందూ బంధువులు కార్యక్రమం నిర్వహించి స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని, గోవధను పూర్తిగా నిషేధించాలని వారు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల్లో రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వినతులను రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్రపతి, ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లే చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గోమాత భారతీయ సంస్కృతిలో, వ్యవసాయ జీవన విధానంలో కీలక పాత్ర పోషిస్తుందని, దానికి ప్రత్యేక గుర్తింపు అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గోమాత ప్రాధాన్యం ఎంతో ఉందని, పాలు, పశుసంపద రైతులకు ఆదాయ వనరుగా ఉంటాయని తెలిపారు. గోమాత సంరక్షణ ద్వారా పర్యావరణ పరిరక్షణకూ తోడ్పాటు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోగిపేట్ ప్రాంతానికి చెందిన హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్న కంచర్లలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 28, బి. డేవిడ్: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని చిన్న కంచర్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి కిరణ్, దుర్గేష్, పురుషోత్తం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సల్మాన్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాయిపేటలో మిన్నంటిన బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వాట్‌పల్లి మండలం సాయిపేట గ్రామంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పార్టీ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొల్పారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నింగపురం మొగలయ్యా పార్టీ జెండాను ఆవిష్కరించగా "జై తెలంగాణ–జై కేసీఆర్" నినాదాలతో గ్రామం మారుమోగింది. అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చండురి సంగీత మల్లేశం మాట్లాడుతూ తెలంగాణ సాధనే లక్ష్యంగా పుట్టిన పార్టీ నేడు రాష్ట్ర అభివృద్ధికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వేడుకల సందర్భంగా బాటసారులకు మజ్జిగ, చలివేంద్రాలు ఏర్పాటు చేసి, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగూర్‌లో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ



సందేశం టైమ్స్, పుల్కల్ మండలం సింగూర్, ఏప్రిల్ 28, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిట్టెపు వీరారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తోందని పేర్కొంటూ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోమాతకు జాతీయ గౌరవం కల్పించాలని తహశీల్దార్‌కు విన్నపం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 28, ప్రతినిధి: భారతీయ సనాతన సంస్కృతికి ప్రతీకగా భావించే గోమాతకు తగిన రక్షణ, గౌరవం కల్పించాలని కోరుతూ "గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్" ఆధ్వర్యంలో వట్‌పల్లి తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. గోమాతకు జాతీయ గౌరవం కల్పించాలని, దేశవ్యాప్తంగా గోవధను అరికట్టేందుకు పటిష్టమైన కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని, గో సంరక్షణ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గోవంశం దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా "ఆత్మనిర్భర్ భారత్" సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సాంస్కృతిక పునరుజ్జీవన కార్యక్రమాల్లో గోమాతకు సముచిత స్థానం కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పంపిన వినతిలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గోభక్తులు, సనాతన ధర్మ కార్యకర్తలు, సామాజిక స్పృహ కలిగిన పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.